నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 22 మార్చి 2024 | NALGONDA

మిర్యాలగూడలోని ఓ మిల్లు ఎదుట నిలిచి ఉన్న ధాన్యం ట్రాక్టర్లు (ఫైల్)

తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

ధాన్యం అమ్మకాల్లో రైతుకు దక్కని గిట్టుబాటు.. నాణ్యత లేదంటున్న మిల్లర్లు

- **తక్కువ సమయంలో పంట చేతికొస్తుందని మహేంద్ర 606 చింట్లు సాగు**
- **జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగు చేసిన రైతులు**
- **క్వాలిటీ లేదని వెనక్కి పంపుతున్న మిల్లర్లు**
- **మిగతా రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,600 వరకు కొనుగోలు**
- **మంత్రి, అధికారుల ఆదేశాలు బేఖాతరు**
- **క్రాప్ వరకే మా బాధ్యత.. మిల్లింగ్‌తో సంబంధం లేదు : మహేంద్ర కంపెనీ సేల్స్ మేనేజర్**

నల్లగొండ, మార్చి 21 : రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని విత్తన కంపెనీలు మాయమాటలు చెప్పి కొత్త విత్తనాలను అంటగడుతున్నాయి. తీరా పంటలు సాగు చేసిన అన్నదాతకు నాణ్యమైన పంటలు చేతికి రాక గగ్గోలు పెట్టే పరిస్థితి ఏర్పడింది. తక్కువ కాలంలో నాణ్యమైన పంట చేతికొస్తుందని ఈ యాసంగిలో రైతులు పెద్ద మొత్తంలో మహేంద్ర 606 చింట్లు వేశారు. కానీ పంట చేతికొచ్చాక ధాన్యం నాణ్యత లేకపోవడంతో కొనేందుకు మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. దాంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తున్నది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితోపాటు అధికారులు రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ధాన్యం కొనాలని మిల్లర్లకు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం ఉండడం లేదు. ఇక్కడ తప్పెవరిది..శిక్ష వరికి అనేది చర్చనీయాంశంగా మారింది. విత్తన కంపెనీల మాటలు విని సాగు చేసిన రైతుదా.. లేదంటే నాణ్యంగా ఉత్పత్తి రాని కంపెనీదా అనేది ప్రశ్నార్థకమైంది. అయితే సుమారు 1.50 లక్షల ఎకరాల్లో సాగు చేసిన మహేంద్ర చింట్లు ప్రస్తుతం మార్కెట్లో రైతులను ఎంతో ఇబ్బంది పెడుతున్నాయి.

కాలం పరిస్థితులకు అనుగుణంగా కంపెనీల ఎత్తులు

ఐదు నెలల్లో చేతికి రావాల్సిన వరి పైరు కాలానుగుణంగా మార్కెట్‌లోకి వచ్చిన కొత్త వంగడాల మూలంగా సన్నాల రూపంలో నాలుగు నెలల్లోనే చేతికొస్తున్నాయి. ఈ వంగడం పచ్చి ధాన్యం అయినా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో సాగర్ ఆయకట్టుతోపాటు నాన్ ఆయకట్టు రైతులు పెద్ద మొత్తంలో చింట్లు సాగు చేశారు. ఒకటి రెండు కంపెనీలు మాత్రం ఈ సారి కాలం పరిస్థితులను అంచనా వేసి నీటి వనరులు తక్కువగా ఉండడంతో వంద రోజుల్లోనే పంట చేతికొస్తుందని రైతులను బురిడీ కొట్టించాయి. మహేంద్ర 606 వెరైటీ విత్తనాలతో వంద రోజుల్లోనే క్వాలిటీతో పంట చేతికొస్తుందని కంపెనీ ప్రతినిధులు చెప్పగా, చాలా మంది రైతులు వాటిని సాగు చేశారు. ఇతర వెరైటీలు మిల్లింగ్ చేస్తే క్వింటాకు 60 నుంచి 65 కేజీల బియ్యం వస్తుండగా ఈ మహేంద్ర 606 వెరైటీ మిల్లింగ్ చేస్తే 48 నుంచి 51 కేజీల బియ్యమే వస్తున్నాయి. మిగతావి నూకలు అవుతున్నాయి. బియ్యం కూడా లావుగా, తెల్ల బెండు ఉంటున్నది. దాంతో రైతులు మహేంద్ర చింట్లు అమ్మలేక అవస్థలు పడుతున్నారు.

నాణ్యత ఉన్న ధాన్యానికి మంచి ధర

జిల్లాలో పచ్చి బియ్యం మిల్లింగ్ చేసే మిల్లులు మార్కెట్‌లోకి వచ్చిన దగ్గర నుంచి మొదట్లో ఆయకట్టులో, ఆ తర్వాత నాన్ ఆయకట్టులో సన్నాల సాగు గణనీయంగా పెరిగింది. ప్రతియేటా వాటి ధర కూడా రైతులు ఆశించిన మేరకే ఉండగా ఈ సారి మాత్రం కొన్ని విత్తన వెరైటీలతోపాటు నీటి కొరత మూలంగా కొంత మేరకు నాణ్యంగా లేవనేది తోసిపుచ్చలేని అంశం. ఈ నేపథ్యంలో నాణ్యత లేని ధాన్యానికి రూ.2వేల నుంచి రూ.2,100 వరకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో నాణ్యంగా ఉన్న సన్నాలకు మిల్లర్లు మంచి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రధానంగా చిట్టి పొట్టి, హెచ్‌ఎంటీ, కావేరీ చింట్లు లాంటి ధాన్యానికి మంచి ధర పెడుతున్నట్లు రైతులు అంటున్నారు. ఆ ధాన్యం క్వింటాకు రూ.2,600 వరకు కొనుగోలు చేస్తున్నారు.

కమిటీల సూచనలు పట్టించుకోని మిల్లర్లు

సన్న ధాన్యం తీసుకొచ్చిన ప్రతి రైతు నుంచి తప్పనిసరిగా క్వింటాకు రూ.2,450 ఇచ్చి కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు మిల్లర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలతో కూడిన కమిటీ వేసింది. ఈ యంత్రాంగం పలు మిల్లులను తిరిగి ధాన్యం కొనాలని చెప్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. నాణ్యత పేరుతో మిల్లర్లు ధాన్యం కొనకుండా రైతులను ఇబ్బందులు పెడుతుంటే సమావేశాలు, సంప్రదింపులు అని కాలం గడుపుతున్నారే తప్ప క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని రైతుల నుంచి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

క్రాప్ వరకే మా బాధ్యత

ఐదేండ్లుగా నల్లగొండ, సూర్యాపేటలో మహేంద్ర చింట్లు విత్తనాలు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు రాని సమస్య ఈ ఏడాది మాత్రమే వచ్చింది. పైగా క్రాప్ వరకే మా బాధ్యత, మిల్లింగ్ అనేది మాకు సంబంధం లేదు. రైతుకు దిగుబడి రాకుంటే మేము బాధ్యులం అవుతాం. కానీ బియ్యం విషయంలో కాదు. పైగా మిల్లర్లు ఈ సీజన్ ప్రారంభం నుంచి కొని ఇప్పుడు మార్కెట్‌లోకి సూపర్ ఫైన్ రకం ధాన్యం రావటంతో మా రకం ధాన్యం పక్కన పెడుతున్నారు. ఆలస్యంగా సాగు చేసిన వారి ధాన్యంలో క్వాలిటీ లోపించవచ్చు. కానీ సకాలంలో సాగు చేసిన వారికి మంచి దిగుబడి వచ్చింది.

–చైతన్య, సేల్స్ ఆఫీసర్, మహేంద్ర విత్తన కంపెనీ

మహేంద్ర చింట్లు వేసి ఆగమైన

నేను మూడు ఎకరాల్లో మహేంద్ర చింట్లు వరి సాగు చేసిన. వంద రోజుల్లోనే పంట చేతికొస్తదని అంటే ఈ సారి వర్షాలు లేవు కదా, తొందరగా చేతికొస్తదని వేసిన. ఇది కోసి మిర్యాలగూడ మిల్లుల్లోకి తీసుకెళ్తే ఏ ఒక్క మిల్లు వారు తీసుకోలేదు. నేను రెండు రోజుల పాటు మిర్యాలగూడ ఏరియాలోని మిల్లుల్లోకి వెళ్లి కొనమంటే ఎవరు కూడా వడ్లు బాగాలేవు కొనము అన్నారు. ఈ విషయం సివిల్ సప్లై అధికారులకు ఫోన్ చేసి చెప్పినా కనీసం అక్కడకు రాకపోగా ఒక్కసారి ఫోన్ ఎత్తి మళ్లీ ఎత్తలేదు. వడ్లు బాగాలేవు అని కొంటలేరు. ఏం చేయాలో తెలియక వాటిని తీసుకొచ్చి ఇంటి దగ్గర ఎండబోసిన.

–మండడి వెంకట్ రెడ్డి, రైతు, మర్రిగూడ, నల్లగొండ

వడ్లు కొనకుండా వెనక్కి పంపిస్తే చర్యలు తీసుకుంటాం

సన్న ధాన్యం తీసుకొని రైతులు మిల్లుల వద్దకు వస్తే వెనక్కి పంపకుండా తప్పని సరిగా కొనుగోలు చేయాలని అన్ని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశాం. దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఒక కమిటీ వేసి మిల్లుల వద్ద పర్యవేక్షణ చేయిస్తున్నాం. ఎవరైనా క్వింటాకు కనీస ధర రూ.2,450 పెట్టి కొనుగోలు చేయాలి. రైతులు కూడా నాణ్యంగా ఉన్న ధాన్యం తీసుకొని రావాలి.

–వెంకటేశ్వర్లు, నల్లగొండ డీఎస్‌ఓ

నీటి కొరత వల్ల నాణ్యతలో కొంత తేడా వస్తుంది

సన్న ధాన్యం అంతా ఒకే రకంగా క్వాలిటీతో ఉంటుంది. ఈ సీజన్‌లో నీటి కొరత కారణంగా కొంత క్వాలిటీలో తేడా వస్తుంది. దాన్ని ఇప్పుడు కాకుండా పాత బియ్యం అయ్యాక వండితే మంచి నాణ్యంగా ఉంటుంది. మిల్లర్లు లేనిపోనిది సాకుగా చూపి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు. రైతులు కూడా నాణ్యంగా ఉన్న ధాన్యం ఒక రాశిలో, నాణ్యంగా లేని ధాన్యం మరో రాశిలో తీసుకెళ్లాలి.

– శ్రవణ్‌కుమార్, నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి

సూర్యాపేట మండలం దుబ్బతండాలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నీళ్లు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం మోసం చేసింది

- కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడానికి 3 పిల్లర్ల కుంగుబాటుకు సంబంధం లేదు
- నాడు జాలువారిన పంట పొలాలు నేడు మోడుబారాయి
- పంట పొలాలు ఎండిపోతుంటే మంత్రులు పట్టించుకోవడం లేదు
- పంట నష్టంపై రైతులకు భరోసా ఇవ్వాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట మండలంలో ఎండిన పంట పొలాల పరిశీలన

సూర్యాపేట రూరల్, మార్చి 21 : సాగు నీరు ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, దాంతో చేతికొచ్చిన వరి పంటలు ఎండిపోయాయని –మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట మండలం ఎర్కారం, దుబ్బతండా, రేఖ్యానాయక్‌తండాలో గురువారం ఎండిన పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను చూసి చలించిపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌పీ ఫేస్–2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారని, ప్రభుత్వం అవగాహన రాహిత్యం వల్ల రైతులు రోడ్డున పడ్డారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొన్నటి వరకు జాలువారిన పంట పొలాలు నేడు మోడుబారడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తే మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందన్నారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడానికి మూడు పిల్లర్లు కుంగుబాటుకు సంబంధం లేనప్పటికీ గత ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు రైతాంగానికి నీళ్లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట పొలాలు ఎండిపోతున్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని, పంట నష్టంపై అంచనా వేసి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, ఎంపీటీసీ లునావత్ శాంతబాయి, నాయకులు మధు, కిరణ్, నవీన్ అనంతరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మా నోట్లో మట్టి కొట్టింది

పంటలను పరిశీలిస్తున్న సమయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో రైతులు తమ ఆవేదనను తెలిపారు. 'అయ్యా నాకు 8 ఎకరాలు ఉంటే ఐదేండ్ల సంది నీళ్లు వచ్చినట్లే ఈ ఏడు కూడా వస్తాయని మొత్తానికి మొత్తం నాటేసిన. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నోట్ల మట్టి కొట్టింది. పంట ప్రారంభంలో కొన్ని నీళ్లిచ్చింది. పంటలు చేతికి వచ్చేంత వరకు నీళ్లిస్తామని చెప్పి గప్పుడిన్ని గప్పుడిన్ని నీళ్లను ఇచ్చింది. నీళ్లు అందకు నాకున్న 8 ఎకరాల్లో 6 ఎకరాలు ఎండిపోయి రెండెకరాలు మాత్రమే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను పట్టించుకునే వారే లేరు. మా బతుకులు మళ్లీ ఆగమైనయి' అని ధరావత్ మాన్య తన గోడు వెల్లబుచ్చాడు.

– ధరావత్ మాన్య, రైతు, సూర్యాపేట మండలం దుబ్బతండా

అలాగే మరో రైతు 'అయ్యా.. బీఆర్ఎస్ హయాంలో పంట పొలాలకు సరిపడా నీళ్లు వస్తే సంతోషంగా పంటలు పండించుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. నీళ్లను ఇస్తానంది. కానీ తీరా వరిపంట పొట్టకు వచ్చిన సమయంలో నీళ్లు ఇయ్యకపోవడంతో పంటలు ఎండిపోయినయి. మా రైతుల కడుపు కాలుస్తున్నది' కన్నీటి గాథను తెలిపాడు.

వ్యవసాయ పరిశోధనలను రైతులకు చేర్చాలి

- ప్రతి రైతుకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి
- జయశంకర్ విశ్వ విద్యాలయం డైరెక్టర్ సుధారాణి
- నల్లగొండలో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారుల సమావేశం

కొత్త వంగడాల సమాచార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధారాణి, అధికారులు, శాస్త్రవేత్తలు

నల్లగొండ, మార్చి 21 : విశ్వ విద్యాయాల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు చేర్చే విధంగా ప్రతి శాస్త్రవేత్త చర్యలు తీసుకోవాలని, దాంతో 25శాతానికిపైగా విస్తరణ సేవలు అందుబాటులోకి వచ్చి సత్ఫలితాలు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం విస్తరణ డైరెక్టర్ వి.సుధారాణి అన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారుల సలహా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 11జిల్లాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు, ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరై 2023 యాసంగి, వానకాలం సీజన్‌లో పంటల పరిస్థితి, సాధించిన ప్రగతి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పరిశోధన ఫలితాలు ప్రతి రైతుకు అందించగలిగినప్పుడే ఉపయోగం ఉంటుందని తెలిపారు. శాస్త్రవేత్తలు విస్తరణాధికారులు మమేకమై వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ కొత్త పుంతలు తొక్కించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నదని, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిగించాలని చెప్పారు. ప్రతి సీజన్‌లో రైతుకు కావాల్సిన అవసరాలు తెలుసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే వానకాలంలో వేసే పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏయే పంటలు వేయాలి అనే దానిపై పక్కా ప్రణాళికతో ఉండాలని సూచించారు. అనంతరం వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది వ్యవసాయ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ రెండు సీజన్లలో రైతుల కోసం చేసిన పరిశోధనలు, వారికి కల్పించిన అవగాహన సదస్సులను వివరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు భరత్ భూషన్, అనిల్ కుమార్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్

నాణ్యత లోపం కారణంగా ధర తక్కువ

- సన్న ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేదు
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్

మిర్యాలగూడ, మార్చి 21 : మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతున్నాయని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీజన్ ప్రారంభం నుంచి ప్రతి రోజూ 3,500 ట్రాక్టర్లకుపైగా ధాన్యం మిల్లుల వద్దకు వస్తున్నాయని, వచ్చిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఇతర జిల్లాల ధాన్యంతో కలుపుకొని ప్రతి రోజూ 5వేలకు పైగా ధాన్యం ట్రాక్టర్లు వస్తున్నాయన్నారు. పెద్దఎత్తున ధాన్యపు ట్రాక్టర్లు రావడం వల్ల మిల్లర్లకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అయినప్పటికీ ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 1.50లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 1.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రతి ఏడాది 4 నుంచి 5లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని, ఈ సారి క్రాప్ లేని కారణంగా 3లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసి ఆ మేరకు కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ఏడాది సీఎంఆర్ కింద 1.70 లక్షల టన్నుల ధాన్యం తీసుకుంటున్నారని, రాబోయే సీజన్‌లో లక్ష టన్నుల ధాన్యం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సీజన్‌లో పంటకు సరైన సాగు నీరు అందకపోవడం వల్ల ఆశించిన పంట రాలేదని, వచ్చిన పంటలో కొంత నాణ్యత లోపం ఉందని చెప్పారు. ప్రధానంగా మహేంద్ర చింటూ, కావేరి చింటూ, హెచ్‌ఎంటీ రకం వంటి సన్నరకం ధాన్యం వస్తున్నాయని, మహేంద్ర చింటూ రకం ధాన్యం ఐఆర్64 ధాన్యానికి పోలికగా ఉన్నాయని, ఇందులో పొడవు, పొట్టి ధాన్యపు గింజలు ఉంటున్నాయని తెలిపారు. అలాంటి ధాన్యాన్ని సెలన్‌లో వేసి బియ్యంగా మార్చినప్పుడు, ఆ బియ్యం ఉడకబెట్టినప్పుడు ముద్దగా, తెల్ల గంజిగా అన్నం తయారవుతుందని అన్నారు. అలాంటి బియ్యం అమ్మడానికి పనికిరాని పరిస్థితి ఉందని, దాని వల్ల ధాన్యం కొనే పరిస్థితి లేదని తెలిపారు.

కావేరి చింట్లు హెచ్‌ఎంటీ వంటి సన్నరకం ధాన్యాన్ని రూ.2,450కు పైగా ధర ఇస్తున్నామన్నారు. నాణ్యత గల ధాన్యం దిగుబడి వచ్చే వరి పంటను సాగు చేసుకుంటే ఉపయోగం ఉంటుందని, మేలు రకమైన వరి విత్తనాలను సాగు చేయాలని సూచించారు. సన్న బియ్యం ఎగుమతి కోసం ప్రభుత్వాలు అనుమతి ఇవ్వాలని, దాని ద్వారా బియ్యంతోపాటు ధాన్యం ధర కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, అధికారులకు, రైతులకు సహకరిస్తున్నామని, చిన్నచిన్న సమస్యలుంటే వాటిని అధిగమించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. వారి వెంట మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణచౌదరి, గంటా సంతోష్ రెడ్డి, కోశాధికారి చిల్లంచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు

- ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నీలగిరి, మార్చి 21 : నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వాటిని అరికట్టాలని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తిని కలిసి గురువారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలపై బనాయించిన కేసులను, వారిపై జరిగిన దాడులను ఎస్పీకి వివరించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల అగడాలు ఎక్కువయ్యాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను టార్గెట్ చేసి అక్రమంగా కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయంలో స్టేషన్‌కు పిలిపించి విపరీతంగా కొడుతున్నారని ఆరోపించారు. 2014లో నియోజకవర్గంలో జరిగిన సంఘటనలే మళ్లీ జరుగుతున్నాయని అన్నారు. మూడు నెలల్లో కేతేపల్లిలోనే అనేక సంఘటనలు జరిగాయని చెప్పారు. కేతేపల్లిలో ఎస్సీ అబ్బాయిని చెట్టుకు కట్టేసి కొడుతున్నారని ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చి అతడిని విడిపించి అతడిపైనే కేసులు పెట్టారని అన్నారు. గుడివాడలో నర్సయ్య అనే వ్యక్తి తన వృత్తి చేసుకుంటూ బోర్లు వేసుకుంటే కనికరం లేని పోలీసులు దెబ్బలు తగిలి ఉన్నా కూడా బొక్కలు విరిగేలా కొట్టారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లను వేదికలుగా చేసుకుని సెంటిల్‌మెంట్‌లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, నియంతలం అనుకునే వారికి ప్రజలు కచ్చితంగా గుణపాఠం చెబుతారని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పటిష్ట నిఘా పెట్టాలి

- కేసుల దర్యాప్తులో టెక్నికల్ ఆధారాలు సేకరించాలి
- అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే

మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు వెంట అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట నిఘా ఉంచాలని, ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర శాఖల సిబ్బందితో టీమ్ వర్క్ చేయాలని ఎస్పీ ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోదాడ సబ్ డివిజన్ పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డయల్ 100 ఫిర్యాదులపై స్పందన వేగంగా ఉండాలని, బ్లూ కోట్స్ సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు వేగంగా దర్యాప్తు చేసి చార్జిషీటు త్వరగా కోర్టులకు పంపించాలని, పలు కేసులకు టెక్నికల్ ఆధారాలను రికార్డు చేసుకోవాలని చెప్పారు. రోడ్డు భద్రత విషయంలో నిత్యం తనిఖీలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పాండరి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, సీఐలు చరమందరాజు, రజితరెడ్డి, రాము, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగంటిన శాలిగౌరారం ప్రాజెక్టు

గతేడాది నీటితో కళకళలాడిన శాలిగౌరారం ప్రాజెక్టు నేడు నీళ్లు లేక వెలవెలబోతున్నది. గడిచిన పదేండ్లలో ఇంత గణనీయంగా నీటిమట్టం తగ్గిన దాఖలాలు లేవు. ప్రతియేటా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి వానకాలం, యాసంగి పంటలకు సరిపడా నీళ్లందించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆయకట్టు కింద యాసంగి సాగు గట్టెక్కేనా అనే మీమాంసలో రైతులు ఉన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీట్టిమట్టం 21 అడుగులకు ప్రస్తుతం 3.6 నుంచి 6 అడుగులు మాత్రమే ఉన్నది.

– శాలిగౌరారం, మార్చి 21

నాటకోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక శాఖ సభ్యులు

30 నుంచి మిర్యాలగూడలో నందిని నాటకోత్సవాలు

మిర్యాలగూడ, మార్చి 21 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 4 వరకు జాతీయ స్థాయి నందిని నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానికంగా నాటకోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పట్టణంలోని మినీ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ నాటకోత్సవాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి నాటికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 15 దరఖాస్తులు రాగా తెలంగాణ నుంచి నాలుగు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. సాంఘీక నాటక పోటీలకు తెలంగాణ నుంచి 13, ఏపీ నుంచి 27 దరఖాస్తులు రాగా తెలంగాణ నుంచి 4, ఏపీ నుంచి 8 దరఖాస్తులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో 9 పద్య, 12 సాంఘీక పోటీల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతి పోటీలో మొదటి బహుమతి రూ.50వేలతోపాటు బంగారు నంది అవార్డు, రెండో బహుమతి రూ.40 వేలతోపాటు వెండి నంది, మూడో బహుమతి రూ.30వేలతోపాటు రాగి నంది, సాంఘీక నాటక పోటీల్లో మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు, పద్య నాటిక బృందానికి రూ.40 వేలు, సాంఘీక నాటిక బృందానికి రూ.20వేలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్‌శర్మ, లక్ష్మీనారాయణ శర్మ, ఉపేందర్, రామావతారం పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ ప్రభుత్వ ఐటీఐకి రూ.41.28 కోట్లు

హుజూర్‌నగర్, మార్చి21 : హుజూర్‌నగర్ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రూ.41.28 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంవత్సరం 110 మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ పొందేందుకు వీలుగా ఐటీఐని ఏర్పాటు చేయనున్నది ప్రభుత్వ ఐటీఐలో పాత కోర్సులతోపాటు అదనంగా 5 రకాల కొత్త ట్రేడ్‌లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.